# పోలింగ్‌కు సర్వం సిద్ధం

మేళ్లచెర్వు, నవంబర్ 29 : మండలంలో గురువారం నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. మండల వ్యాప్తంగా మెత్తం 33,312మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 16,341, స్త్రీలు 16,970, ఇతరులు ఒక్కరు ఉన్నారు. వీరి కోసం మొత్తం 42 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓటు వేసేందుకు వచ్చే వికలాంగుల కోసం ర్యాంపులను ఏర్పాటు చేయడంతో పాటు ఓటర్లకు పలు మౌలిక వసుతులు కల్పించారు. మండలంలోని వేపలమాధవరం, కందిబండ, రామాపురం, కప్పలకుంటతండ గ్రామాలను పోలీసులు సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. శాంతి భద్రతల పరిరక్షణకు అదనపు బలగాలను రప్పించి పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు.

గరిడేపల్లి : మండలంలో గురువారం నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలో 32గ్రామ పంచాయతీలకు 45,632మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 22,156 మంది, మహిళలు 23,468మంది, థర్డ్ జెండర్ 8 మంది ఉన్నారు. వీరందరు ఓటు హక్కును వినియోగించుకునేందుకు మండల వ్యాప్తంగా 57 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో 57 మంది ప్రిసైడింగ్ అధికారులు, 57 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 125మంది పోలింగ్ అధికారులు, ఏడుగురు సెక్టోరియల్ అధికారులు విధులు నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తాసీల్దార్ బి.కవిత తెలిపారు. వీరితో పాటు ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సజావుగా జరిగేందుకు 80మంది పైగా సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా మండలంలో పొనుగోడు, వెలిదండ, గానుగుబండ, కల్మల్‌చెర్వు, రాయినిగూడెం, కొత్తగూడెం గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అదేవిధంగా మండలంలోని ఐదు స్ట్రైకింగ్ ఫోర్స్‌లను నియమించినట్లు తెలిపారు. పోలింగ్ ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నారు. ఓటర్లు తప్పనిసరిగా తమ వెంట పోలింగ్ స్లిప్‌తో పాటు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన పత్రాల్లో ఏదో ఒకటి తప్పనిసరిగా తేవాలని అధికారులు సూచించారు.

చింతలపాలెం : అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మండలవ్యాప్తంగా అధికారులు అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది సామాగ్రితో పోలింగ్ బూత్‌లకు చేరుకున్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులు సిబ్బందితో పాటు, కేంద్ర బలగాలను సైతం రంగంలోకి దించారు. మండలంలో 16గ్రామ పంచాయతీలకు గాను 36పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం ఓటర్లు 26,012 మంది ఉండగా ఇందులో పురుషులు 12,801 మంది, స్త్రీలు 13,211 ఉన్నారు.

నేరేడుచర్ల : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం మండలంలో నిర్వహించే పోలింగ్‌కు నేరేడుచర్ల మండలం, పట్టణంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మండలంలో 35,022 మంది ఓటర్లు ఉండగా 43పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ బూత్‌ల్లో శాంతి భద్రతల పర్యవేక్షణకు ఒక సీఐ, ఇద్దరు ఎస్ఐలు, 8మంది ఏఎస్ఐలు, 21మంది పోలీస్ కానిస్టేబు ళ్లు, 35మంది హోంగార్డులను నియమించారు. మండలంలోని మేడారం, కల్లూరు పెంచికల్‌దిన్న, దిర్శించర్ల గ్రామాలను సమస్యత్మక గ్రామాలుగా గుర్తించామని ఈ గ్రామాల్లో ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి బందోబ స్తు ఏర్పాటు చేశారు. విధులు నిర్వహించే సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు సామగ్రితో ఇప్పటికే చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో 144సెక్షన్ అమల్లో ఉంటుందని ఐదుగురికి మించి ఎక్కడా గుమి కూడవద్దని సూచించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ శాంతి భద్రతలు పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ పరమేశ్ తెలిపారు.



హుజూర్‌నగర్ : ఎన్నికల విధులకు తరలివెళ్తున్న సిబ్బంది



ఎన్నికల సామగ్రిని సరి చూసుకుంటున్న సిబ్బంది



నేరేడుచర్ల : ఎన్నికల విధులకు తరలివెళ్తున్న సిబ్బంది



మేళ్లచెర్వు ఉన్నత పాఠశాల పోలింగ్ బూత్

# అసెంబ్లీ ఎన్నికలకు భారీ బందోబస్తు



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

**● ఎస్పీ రాహుల్ హెగ్డే**

హుజూర్‌నగర్, నవంబర్ 29 : జిల్లాలో గురువారం నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఎన్నికల ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. పోలింగ్‌స్టేషన్లను సమస్యాత్మకమైనవి, సాధారణ మైనవి రెండు విభాగాలుగా విభజించినట్లు తెలిపారు. సమసాత్మక గ్రామాలను గుర్తించి ఆయా పోలింగ్ స్టేషన్ల వద్ద కేంద్ర పారామిలటరీ బలగాలను మొహరించినట్లు తెలిపారు. జిల్లాలో చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను ముమ్మరం చేశామన్నారు. ఇప్పటి వరకు రూ.10.7కోట్ల నగదును సీజ్ చేయడంతో పాటు, 4వేల మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. జిల్లాలో 1,050 సమసాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాల, లైవ్ ఫుటేజీ వచ్చేలా ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ మేక నాగేశ్వర్‌రావు, కోదాడ డీఎస్పీ ప్రకాశ్, సీఐ రామలింగారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల విధులు సమర్థవంతగా నిర్వహించాలి

హుజూర్‌నగర్ : ఎన్నికల విధులను అధికారులు సమర్థవంతగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ప్రియాంక, డీఆర్వో జగదీశ్వర్‌రెడ్డి సూచించారు. హుజూర్‌నగర్‌లోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. నియోజకవర్గంలో 29రూట్లలో 269వాహనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 308 పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. సమసాత్మక గ్రామాల్లో సీసీ కెమెరాలతో భారీ భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 29మంది సెక్టోరియల్ అధికారులు, 2రిసీవర్లు, 91క్రిటికల్ లోకేషన్లు గుర్తించామన్నారు. ఎస్ఎస్‌టీ3, ఎఫ్ఎస్‌టీ3, ఎంసీసీ9, వీవీటీ1, వీఎస్‌టీ1, ఏఈఓ1టీములను ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అనంతరం సిబ్బందికి ఈవీఎం సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్లు నాగార్జునరెడ్డి, మంగ, సరిత, శ్రీదేవి పాల్గొన్నారు.




హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రియాంక



రామనర్సింహారెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే సైదిరెడ్డి

## రామనర్సింహారెడ్డికి మంత్రి జగదీశ్‌రెడ్డి నివాళి

నేరేడుచర్ల, నవంబర్ 29 : నేరేడుచర్ల మండల తొలి ఎంపీపీ తాటికొండ రామనర్సింహారెడ్డి(99) మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. రామనర్సింహారెడ్డి భౌతికకాయాన్ని మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాల ధనుంజయనాయుడు బుధవారం సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ నేరేడుచర్ల ప్రజలకు రాజకీయ ఓనమాలు దిద్దించిన ఘనత రామనర్సింహా రెడ్డికే దక్కుతుందన్నారు. నేరేడుచర్ల తొలి ఎంపీపీగా పనిచేయడంతో పాటు, వివిధ పార్టీల్లో వివిధ హోదాల్లో ఆ పార్టీల అభివృద్ధికి చేసిన కృషి మరువలేనిదన్నారు. చివరి దశలో సైతం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి సమర్థవంతమైన సేవలు అందించారని కొనియాడారు. అంతిమ యాత్రలో వివిధ పార్టీల రాజకీయ నాయకులు, పలువురు ప్రముఖులు పాల్గొని నివాళులర్పించారు. అంతకుముందు రెండు రోజుల క్రితం మిర్యాలగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలోమృతి చెందిన నేరేడుచర్ల పట్టణానికి చెందిన బొడ్ల కృష్ణ, మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామానికి చెందిన మేడిపల్లి కృష్ణయ్య చిత్రపటాలకు ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### మహిళలకు ప్రత్యేక పోలింగ్ కేంద్రం

మిర్యాలగూడ రూరల్ : మండలంలోని చింతపల్లి గ్రామంలో మహిళా ఓటర్లకు ప్రత్యేక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసినట్లు తాసీల్దార్ హరిబాబు తెలిపారు. మండలంలో మొత్తం 64 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని, అన్ని కేంద్రాల్లో సిబ్బంది, సామగ్రిని అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.